# అదిగదిగో.. ద్వారక!





ద్వారక, ఫిబ్రవరి 20: శ్రీకృష్ణుడి కర్మభూమిని అన్వేషించే ప్రయత్నాలు మళ్లీ మొదలయ్యాయి. సముద్రగర్భంలోని సుందర ద్వారకపై ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) మరోసారి అధ్యయనం చేస్తున్నది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఏఎస్ఐ అనుబంధ విభాగమైన అండర్‌వాటర్ ఆర్కియాలజీ వింగ్(యూఏడబ్ల్యూ) అరేబియా సముద్రంలో శోధనలు ప్రారంభించింది. కృష్ణుడు నడయాడిన నేలకు సంబంధించిన మరిన్ని విశేషాలను బాహ్య ప్రపంచానికి తెలిపేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం అడిషనల్ డైరెక్టర్ జనరల్(ఆర్కియాలజీ) ప్రొఫెసరల్ అలోక్ త్రిపాఠి నేతృత్వంలోని

- కృష్ణుని కర్మభూమిపై మరోసారి ఏఎస్ఐ అధ్యయనం
- రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ అన్వేషణ మొదలు
- అరేబియా సముద్రగర్భంలోకి ఐదుగురు డైవర్లు
- 4 వేల ఏండ్ల పురాతన నగరం గుట్టు విప్పే యత్నం

ఐదుగురు సభ్యుల పురావస్తు శాస్త్రవేత్తల బృందం పని చేస్తున్నట్టు కేంద్ర సాంస్కృతిక శాఖ వెల్లడించింది. ఈ ఐదుగురి బృందంలో ముగ్గురు మహిళా ఆర్కియాలజిస్టులు అపరాజిత శర్మ, పూనమ్ వింద్, రాజ్‌కుమారి బర్బినా కూడా ఉన్నారు.

**ద్వారక వెనుక ఉన్న విశ్వాసం**

హిందూ పురాణాలు, ఇతిహాసాల్లో ద్వారక నగరానికి విశేష ప్రాధాన్యం ఉంది. కృష్ణుడి కర్మభూమిగా భావించే ఈ నగరం హిందువుల ఏడు మోక్షనగరాల్లో ఒకటి. జరాసంధుడి దాడుల నుంచి తన ప్రజలను రక్షించుకునేందుకు కృష్ణుడు మధురను వీడి, గోమతీ నదీ - అరేబియా సముద్ర సంగమ ప్రాంతానికి వెళ్తాడు. దేవశిల్పి విశ్వకర్మ సాయంతో అక్కడ సుందర ద్వారక నగరాన్ని నిర్మించాడని విశ్వాసం. దీనినే బేట్ ద్వారక అంటున్నారు. శ్రీకృష్ణుడు అవతారం చాలించిన తర్వాత ద్వారక నగరం సముద్రంలో మునిగిపోయిందని భావిస్తారు.

**ఇప్పటివరకు ఏం తేలింది?**

ద్వారక నగరాన్వేషణ పురావస్తు శాస్త్రవేత్తలకు నిత్యం ఒక కుతూహలాన్ని కలిగిస్తుంది. 1930లలో మొదటిసారిగా హిరానంద్ శాస్త్రి ద్వారక రహస్యాలను తెలుసుకునేందుకు అన్వేషించారు. 1963లో జేఎం నానావతి, హెచ్‌డీ సంకాలియా ఆధ్వర్యంలో మొదటిసారిగా ద్వారకలో తవ్వకాలు జరిగాయి. 1969-70, 1983-1990 మధ్య సముద్రగర్భంలో ద్వారక అవశేషాలను, అప్పుడు వినియోగించిన కొన్ని వస్తువులను సముద్ర పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించారు. చివరగా 2005-07లోనూ యూఏడబ్ల్యూ ఆధ్వర్యంలో అన్వేషణ జరిగింది. వీరంతా సముద్రగర్భంలో ప్రణాళికబద్ధంగా నిర్మించిన ఒక నగర అవశేషాలు, అద్భుతమైన నిర్మాణాలు ఉన్నాయని తేల్చారు.

**దశలవారీగా అధ్యయనం**

శ్రీకృష్ణుడు నిర్మించిన ద్వారక నగరం సముద్రంలో మునిగిపోయిందని పురాణాలు చెప్తున్నాయి. సముద్రగర్భంలో నిజంగానే ఒక నగర అవశేషాలు ఉన్నాయని పురావస్తు శాస్త్రవేత్తల అధ్యయనాలు తేల్చాయి. అయితే, శ్రీకృష్ణుడి ద్వారక నగరం ఇదేనా? సముద్రగర్భంలోని నిర్మాణాలు ఏ కాలం నాటివి? ఈ నిర్మాణాల విశేషాలు ఏంటి? అనేది తేలాల్సి ఉంది. పురాణాలకు, చరిత్రకు మధ్య ఉన్న ఈ అంతరాన్ని పూడ్చడమే ఇప్పుడు అండర్‌వాటర్ ఆర్కియాలజీ వింగ్ చేస్తున్న అన్వేషణ లక్ష్యం. దశలవారీగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు, ఇప్పుడు ప్రాథమిక అధ్యయనం కోసం గోమతి నదీ సమీప ప్రాంతాన్ని ఎంచుకున్నట్టు అధికారులు తెలిపారు.

## ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణం

రాంలీలా మైదానంలో ఘనంగా కార్యక్రమం

**మంత్రులుగా మరో ఆరుగురి ప్రమాణస్వీకారం**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ఢిల్లీ 9వ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. గురువారం రాంలీలా మైదానంలో అట్టహాసంగా ఈ కార్యక్రమం జరిగింది. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. మంత్రులుగా పర్వేశ్ వర్మ, కపిల్ మిశ్రా, మన్‌జీందర్ సింగ్ సిర్సా, ఆశిష్ సూద్, రవిందర్ ఇంద్రాజ్ సింగ్, పంకజ్ సింగ్ సైతం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భారీగా బీజేపీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. అనంతరం సచివాలయంలో రేఖా గుప్తా సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం మొదటి మంత్రివర్గ సమావేశం జరిగింది. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ రిపోర్టులను అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ఇందులో నిర్ణయం తీసుకున్నారు. కాగా, కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు పూర్తయ్యింది. ఆర్థిక, రెవెన్యూ శాఖలను సీఎం రేఖా గుప్తా తన వద్ద ఉంచుకున్నారు.

**వచ్చే నెల నుంచే మహిళలకు 2,500**

వికసిత్ ఢిల్లీ కోసం ఒక్క రోజు కూడా వృథా చేయకుండా తన ప్రభుత్వం పని చేస్తుందని సీఎం రేఖా గుప్తా చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని, మార్చి 8న మహిళా దినోత్సవం నుంచి మహిళలకు నెలకు రూ.2,500 ఇచ్చే పథకాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. గత పదేండ్లలో ఢిల్లీ ప్రజల సొమ్ముకు గత ఆప్ ప్రభుత్వాన్ని జవాబుదారీగా మారుస్తామని తెలిపారు.

**నాటి బహిష్కృత నేతే.. నేటి ఢిల్లీ స్పీకర్**

ఆప్ హయాంలో విపక్ష నేతగా వ్యవహరించి అసెంబ్లీ నుంచి బహిష్కరణ, మార్షల్స్ చేతిలో గెంటివేతకు గురైన మాజీ ప్రతిపక్ష నేత విజేందర్ గుప్తా ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ కానున్నారు. 2015, 2016ల్లో ఆయనను మార్షల్స్ సభ నుంచి ఈడ్చుకెళ్లినంత పనిచేశారు. ఆయనను అసెంబ్లీ నుంచి స్పీకర్ బహిష్కరించడంతో మార్షల్స్ బలవంతంగా బయటకు లాక్కెళ్లారు.

# మరెవర్నో గెలిపించే ప్రయత్నం

- బైడెన్ యంత్రాంగంపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- ఇండియాలో ఎన్నికల కోసం 181 కోట్ల నిధులెందుకు?
- ట్రంప్ ఆరోపణలతో భారత్‌లో రాజకీయ దుమారం
- విదేశీ సంస్థల చేతిలో పావుగా రాహుల్ గాంధీ: బీజేపీ
- ట్రంప్ వ్యాఖ్యలు అర్థం లేనివి: కాంగ్రెస్ పార్టీ



న్యూయార్క్, ఫిబ్రవరి 20: భారత్ ఎన్నికలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో మరెవర్నో గెలిపించాలని మాజీ అధ్యక్షుడు బైడెన్ యంత్రాంగం ప్రయత్నించిందని ఆయన ఆరోపించారు. భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు గత బైడెన్ ప్రభుత్వం రూ.181 కోట్ల నిధులు కేటాయించిందని ఇటీవల ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్) వెల్లడించింది. దీనిపై మియామిలో జరిగిన ఎఫ్ఐఐ సదస్సులో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'భారత్‌లో ఓటింగ్ కోసం మనం 181 కోట్లు ఎందుకు ఖర్చు చేయాలి? వాళ్లు(బైడెన్ యంత్రాంగం) భారత్‌లో మరెవర్నో గెలిపించాలని ప్రయత్నించారని అనుకుంటున్నాను. ఈ విషయాన్ని భారత ప్రభుత్వానికి చెప్పాలి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**భారత ప్రయోజనాలను దెబ్బతీసేందుకే..**

ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్‌పై బీజేపీ ఆరోపణలు గుప్పించింది. విదేశీ వ్యవస్థలతో రాహుల్ గాంధీ జతకట్టారని, భారతదేశ వ్యూహాత్మక, భౌగోళిక, రాజకీయ ప్రయోజనాలను దెబ్బతీసేందుకు విదేశీ శక్తుల చేతుల్లో పావుగా మారారని బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయ ఆరోపించారు. తాను మరోసారి అధికారంలోకి రాకుండా విదేశీ శక్తులు ప్రయత్నిస్తున్నాయని 2024 ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ చెప్పిన మాటలను ట్రంప్ వ్యాఖ్యలు బలపరుస్తున్నాయని పేర్కొన్నారు. 2023 మార్చిలో రాహుల్ గాంధీ లండన్ వెళ్లి భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని అమెరికా, ఐరోపాలోని విదేశీ శక్తులను కోరారని ఆరోపించారు. కాగా, ట్రంప్ వ్యాఖ్యలు అర్థం లేనివని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. 1961లో యూఎస్ఏఐడీని స్థాపించారని, అప్పటినుంచి దశాబ్దాలుగా భారత్‌లోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు ఈ సంస్థ ఇచ్చిన నిధులపై కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



వీణారెడ్డి

**తెరపైకి వీణారెడ్డి పేరు**

భారత్‌లో ఎన్నికల కోసం యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్ఏఐడీ) నిధుల కేటాయింపు అంశంలో తెలుగు సంతతి మహిళ వీణారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఆమె అమెరికా ప్రభుత్వంలో విదేశాంగ అధికారి. 2021 ఆగస్టు నుంచి 2024 జూలై వరకు యూఎస్ఏఐడీకి భారత్ డైరెక్టర్‌గా పని చేశారు. ఈ నేపథ్యంలో యూఎస్ఏఐడీ భారత్‌లో ఎన్నికల కోసం ఇచ్చిన నిధులతో పాటు వీణారెడ్డి పాత్రపై విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ మహేశ్ జఠ్మలానీ డిమాండ్ చేశారు. కాగా, వీణారెడ్డి ఏపీలో జన్మించి, అమెరికాలో స్థిరపడ్డారు. ఆమె భారత్‌లో డైరెక్టర్‌గా పని చేసినప్పుడు దేశంలో విద్య, వైద్యం, ఎయిడ్స్ నివారణకు సంబంధించిన ప్రాజెక్టులకు యూఎస్ఏఐడీ నుంచి పెద్దఎత్తున నిధులు కేటాయించారు.

### భారత్‌లో టెస్లా పరిశ్రమ.. అమెరికాకు అన్యాయమే: ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 20: భారత్‌లో టెస్లా పరిశ్రమను నిర్మించడం అమెరికాకు అన్యాయం చేయడమే అవుతుందని డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. తాజాగా 'ఫాక్స్ న్యూస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్‌లో కారు విక్రయించడం ఎలాన్ మస్క్‌కు అసాధ్యం. ప్రపంచంలో ప్రతి దేశం సుంకాల ద్వారా మనల్ని ఉపయోగించుకుంటుంది. ఉదాహరణకు భారత్‌లో ఒక కారు విక్రయించడం కూడా అసాధ్యం. ఒకవేళ ఆయన(ఎలాన్ మస్క్) భారత్‌లో పరిశ్రమను నిర్మించాలనుకుంటే నిర్మించుకోవచ్చు. కానీ, ఇది అమెరికాకు చాలా అన్యాయమే' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా, భారత్‌లో ఇటీవల ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా సంస్థ నియామక ప్రక్రియ ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సంస్థ త్వరలో భారత్‌లో పరిశ్రమను నెలకొల్పనున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

## మంచు కొండలు కరిగిపోతున్నాయ్!

*ఏటా 27.3 వేల కోట్ల టన్నుల మంచు కరిగి, మహా సముద్రాల్లోకి*

న్యూఢిల్లీ: భూమిపై మంచు కొండలు అత్యంత వేగంగా కరిగిపోతున్నాయని, త్వరలో అవి మాయం కాబోతున్నాయని తాజా అధ్యయనం హెచ్చరించింది. ఏటా 27.3 వేల కోట్ల టన్నుల మంచు కరిగిపోయి, మహా సముద్రాల్లోకి చేరుతున్నదని తెలిపింది. ప్రపంచంలోని మంచు కొండల విస్తృతి సగటున 5 శాతం తగ్గిపోయిందని, మధ్య యూరోపులో ఇప్పటికే దాదాపు 40 శాతం తగ్గిపోయిందని వెల్లడించింది. మంచు కొండలు కరుగుతుండటం వల్ల 2000వ సంవత్సరం నుంచి సముద్ర మట్టం 0.7 అంగుళాలు పెరిగిందని, మహా సముద్రాల్లో నీరు పెరగడానికి కారణమవుతున్న వాటిలో ఇది రెండోదని తెలిపింది. అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం ఈ అధ్యయనాన్ని నిర్వహించింది.



## పర్వతాల కింద హైడ్రోజన్!

- పైరినీస్, యూరోపియన్ ఆల్ప్స్, హిమాలయ శ్రేణుల్లో వైట్ హైడ్రోజన్ నిల్వలు
- జర్మనీ భూగర్భ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి
- పర్యావరణహిత వైట్ హైడ్రోజన్‌కు భారీ డిమాండ్
- శిలాజ ఇంధనాల కొరతకు చెక్ పెట్టే అవకాశం

బెర్లిన్, ఫిబ్రవరి 20: పర్వత శ్రేణుల కింది భాగంలో పెద్ద మొత్తంలో పర్యావరణహిత వైట్ హైడ్రోజన్ నిల్వలు ఉన్నట్టు ఓ అధ్యయనంలో వెల్లడైంది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా భావిస్తున్న దీనికి భారీ డిమాండ్ ఉంది. నాచురల్ (సహజ) లేదా జియోలాజిక్ హైడ్రోజన్‌గా పిలిచే ఇది పర్వత ప్రాంతాల్లోని భూమి లోపలి పొరల్లో ఉండే అవకాశముందని అధ్యయనంలో తేలింది. ప్రధానంగా పైరినీస్, యూరోపియన్ ఆల్ప్స్, హిమాలయ శ్రేణుల్లో వీటి నిల్వలు ఉండవచ్చని భూగర్భ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. జర్మనీలోని హెల్మ్‌హోల్ట్జ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ శాస్త్రవేత్తల అధ్యయనంలో ఈ విషయాలు వెలుగు చూశాయి.

**శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయం**

శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా, వాతావరణ కాలుష్యాన్ని అడ్డుకోవడంలో కీలకపాత్ర పోషిస్తుందని భావిస్తున్న వైట్ హైడ్రోజన్‌పై కొంతకాలంగా శాస్త్రవేత్తల దృష్టిపడింది. తాజా పరిశోధనలో భాగంగా వైట్ హైడ్రోజన్ తయారయ్యేందుకు అనుకూల పరిస్థితులు ఉండే ప్రాంతాల కోసం భూమి లోపలి పొరల్లోని టెక్టోనిక్ ప్లేట్స్ కదలికలను వారు అధ్యయనం చేశారు. ఈ క్రమంలోనే కంప్యూటర్ నమూనాల ద్వారా ఆయా పర్వత శ్రేణుల్లో వైట్ హైడ్రోజన్ ఉండే ఆస్కారముందని కనుగొన్నారు.

**సెర్పెంటైజేషన్ ప్రక్రియ ద్వారా..**

భూమి లోపలి పొరల్లో ఉండే ప్రత్యేకమైన ఇనుప ఖనిజం (మాంటిల్ రాక్)తో నీరు చర్య జరిగినప్పుడు ఈ వైట్ హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుంది. అయితే, మాంటిల్ రాక్ భూమి ఉపరితలం నుంచి చాలా లోతుల్లో ఉంటుంది. అక్కడ నీటి లభ్యత ఉండదు. భూమి టెక్టోనిక్ ప్లేట్ల కదలికలు, ఖండాలు అంతర్భాగంలో పరస్పరం ఢీకొన్నప్పుడు కొన్నిసార్లు ఈ మాంటిల్ రాక్ పైకి వచ్చే ఆస్కారం ఉంటుంది. డ్రిల్లింగ్ ద్వారా వాటిని వెలికి తీసి, నీటితో చర్య జరిపితే వైట్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ ప్రక్రియను సెర్పెంటైజేషన్ అని అంటారు. ఇప్పుడు ఈ ప్రక్రియపై తాము దృష్టిపెట్టామని అధ్యయనానికి నేతృత్వం వహించిన పరిశోధకుడు ఫ్రాంక్ జ్వాన్ స్పష్టం చేశారు.

**ప్రపంచ ఇంధన కొరత తీర్చేందుకు**

కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో నీరు రసాయన చర్యకు గురైనప్పుడు ఉత్పత్తయ్యే వాయువును వైట్ హైడ్రోజన్ అంటారు. ప్రస్తుతం కమర్షియల్ హైడ్రోజన్‌ను శిలాజ ఇంధనాలను ఉపయోగించి తయారు చేస్తున్నారు. దీని వల్ల పర్యావరణానికి హాని జరుగుతున్నది. అందువల్ల గ్రీన్ ఫ్యూయల్‌గా పిలుచుకునే దీనికి భారీ డిమాండ్ ఏర్పడింది. ప్రత్యేకించి ఏవియేషన్, స్టీల్ తదితర పరిశ్రమల్లో దీనికి డిమాండ్ ఉంది. 1987లో మాలిలో ప్రమాదవశాత్తూ బావిలో కాలుతున్న సిగరెట్ పడటం వల్ల దీన్ని మొట్టమొదటిసారిగా కనుగొన్నారు. ప్రమాద సమయంలో ఆ బావిని మూసివేయగా.. 2011లో తిరిగి తెరిచారు. అప్పటినుంచి అక్కడ వైట్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసి స్థానిక గ్రామానికి కావాల్సిన విద్యుత్తును అందిస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ తదితర దేశాల్లో గతంలోనే దీన్ని కనుగొన్నారు. అయితే, అది చాలా చిన్న మొత్తంలోనే. ప్రపంచ ఇంధన కొరత తీర్చేంత పెద్దమొత్తంలో వైట్ హైడ్రోజన్ నిల్వల కోసం ఇప్పటికీ అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది.

# గ్యారెంటీలకు గ్యారెంటీ లేదు

- కర్ణాటకకు గుదిబండగా కాంగ్రెస్ పథకాలు
- స్కీమ్‌ల అమలుకు తీవ్ర నిధుల కొరత
- రాష్ట్ర ప్రణాళిక శాఖ నివేదికలో బహిర్గతం
- 3 నెలలుగా అందని అన్నభాగ్య, గృహలక్ష్మి



బెంగళూరు, ఫిబ్రవరి 20: ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గ్యారెంటీల పేరుతో అలవికాని హామీలు ఇచ్చిన కర్ణాటక కాంగ్రెస్ ఇప్పుడు వాటిని అమలు చేయలేక ఆపసోపాలు పడుతున్నది. ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా ఇచ్చిన హామీలు రాష్ట్ర ఖజానాను ఖాళీ చేస్తున్నాయి. దీంతో లబ్ధిదారులకు పథకాల బకాయిలు పెరిగిపోతున్నాయి. కర్ణాటక ప్రభుత్వ ప్రణాళిక విభాగం తాజా నివేదిక రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బహిర్గతం చేసింది. 2024-25కు గానూ ప్రభుత్వం రూ.3.71 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టింది. 2024 డిసెంబర్ చివరి నాటికి ఇందులో 3.31 లక్షల కోట్లు కేటాయించింది. అయితే, విడుదల చేసినవి మాత్రం కేవలం రూ.2.03 లక్షల కోట్లే. ఇందులో ఖర్చు చేసినవి రూ.1.89 కోట్లు మాత్రమే. కేటాయింపులు, నిధుల విడుదలకు మధ్య రూ.1.28 లక్షల కోట్లు(61.3 శాతం) తేడా ఉండటం రాష్ట్ర ఆర్థిక స్థితికి అద్దం పడుతున్నది.

**నెలలుగా అందని గ్యారెంటీలు**

నిధుల కొరత కారణంగా గ్యారెంటీలు సరిగ్గా అమలు కావడం లేదు. మహిళలకు నెలకు రూ.2000 ఇచ్చే గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు మూడు నెలలుగా ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. జనవరి 31 నాటికి గృహలక్ష్మి బకాయిలు రూ.7,517 కోట్లు ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం అన్నభాగ్య పథకం కింద ఒక్కొక్కరికి 10 కేజీల బియ్యం ఇవ్వాలి. ఇందులో కేంద్రం 5 కిలోలు, రాష్ట్రం 5 కిలోలు ఇవ్వాల్సి ఉంటుంది. బియ్యం కొరత కారణంగా కేజీకి రూ.34 చొప్పున డబ్బులు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే, 5 నెలలుగా లబ్ధిదారులకు ఈ డబ్బులు ఇవ్వడం లేదని తెలుస్తున్నది.

**దేవుడు కూడా బాగు చేయలేడు**

**- బెంగళూరు రోడ్లపై డీకే వ్యాఖ్యలు**

బెంగళూరులో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను బాగు చేయడం భగవంతుడికి కూడా కష్టమేనని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'భగవంతుడు స్వర్గం నుంచి దిగి వచ్చి బెంగళూరు వీధుల్లో నడిచినా రెండు మూడేండ్లలో ఏమీ మారదు. పరిస్థితి చాలా క్లిష్టంగా మారుతున్నది. మనం సరైన ప్రణాళికతో ప్రాజెక్టులను సమర్థంగా అమలు చేయాలి. భవిష్యత్తు కోసం మంచి కారిడార్ అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నాం' అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, బెంగళూరు రోడ్లపై 96 శాతం గుంతలను పూడ్చేశామని ఏడాది క్రితం అసెంబ్లీ సాక్షిగా డీకే శివకుమార్ ప్రకటించడం గమనార్హం.

## 'కోడ్ ఆఫ్ ఎథిక్స్' పాటించాల్సిందే

**చట్టానికి లోబడే ఓటీటీ కంటెంట్ ఉండాలి**

సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: సామాజిక మాధ్యమాలపై హాస్యం పేరిట అశ్లీలత వ్యాప్తి చెందడంపై వివాదం ఏర్పడిన నేపథ్యంలో కేంద్రం చర్యలకు ఉపక్రమించింది. చట్టం నిషేధించిన కంటెంట్‌ను ప్రసారం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను కేంద్రం హెచ్చరించింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లతోపాటు సోషల్ మీడియా వేదికలు కంటెంట్‌ను ప్రసారం, ప్రచురణ చేసే సమయంలో 2021 నాటి ఐటీ నిబంధనల కింద నిర్దేశించిన నైతిక నియమావళికి (కోడ్ ఆఫ్ ఎథిక్స్) కట్టుబడి ఉండాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ గురువారం ఆదేశించింది. కంటెంట్‌ను ప్రసారం లేదా ప్రచురించే సమయంలో వయసు ఆధారంగా వర్గీకరణను కచ్చితంగా పాటించాలని తెలిపింది. ఏ రేటెడ్ కంటెంట్‌ను ప్రసారం చేసే విషయంలో చట్ట నిబంధలకు లోబడి వ్యవహరించాలని ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించింది. సుప్రీంకోర్టు ఇటీవల చేసిన సూచనల మేరకు కేంద్రం నుంచి ఈ ఆదేశాలు వెలువడ్డాయి.



## ఉద్యోగులకు 2 నిమిషాలే టాయిలెట్ బ్రేక్

**ఉల్లంఘిస్తే జరిమానా..చైనా కంపెనీ నిబంధన**

బీజింగ్, ఫిబ్రవరి 20: టాయిలెట్ వాడకంపై ఉద్యోగులకు టైమ్ స్లాట్లు కేటాయిస్తూ చైనాకు చెందిన ఓ కంపెనీ జారీచేసిన ఉత్తర్వులపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. త్రీ బ్రదర్స్ మెషిన్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ ఫిబ్రవరి 11 నుంచి ఈ కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. ఉద్యోగులు తమకు కేటాయించిన టైమ్ స్లాట్లలో రెండు నిమిషాలు మాత్రమే టాయిలెట్‌ను వినియోగించుకోవలసి ఉంటుంది. చైనాకు చెందిన ప్రాచీన చక్రవర్తి ఒకరు(ఎల్లో ఎంపరర్) చేసిన ఆరోగ్య సూత్రాలను స్ఫూర్తిగా తీసుకుని ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్టు కంపెనీ తెలిపిందని సౌత్ చైనా మార్నింగ్ పోస్టు పేర్కొంది. అయితే టాయిలెట్‌ను ఎక్కువసార్లు ఉపయోగించాల్సిన ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి కాస్త వెసులుబాటు కల్పిస్తూ అలాంటి ఉద్యోగులు హెచ్‌ఆర్ విభాగం వద్ద ప్రత్యేక అనుమతి తీసుకోవాలని, అదనపు సమయం వాడుకున్నందుకు వారి జీతంలో కొంత కోత విధిస్తామని కంపెనీ తెలిపింది.నిబంధనలు అతిక్రమించిన వారికి 100 యువాన్లు(సుమారు రూ. 1200) జరిమానా ఉంటుందని కంపెనీ హెచ్చరించింది. ఫిబ్రవరి 28 వరకు ప్రయోగాత్మకంగా ఈ నిబంధనలు అమలులో ఉంటాయని, మార్చి 1 నుంచి పూర్తిస్థాయిలో ఇవి అమలులోకి వస్తాయని కంపెనీ ప్రకటించింది. కాగా, ఈ నిబంధనలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది కార్మిక చట్టాలకు వ్యతిరేకమని చైనా న్యాయవాది చెన్ షిజింగ్ స్పష్టం చేశారు. ప్రజలలో కూడా దీనిపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

## కుంభమేళాలో స్నానం చేస్తున్న మహిళల వీడియోలు విక్రయం

- అప్రమత్తమైన యూపీ అధికారులు
- ఇప్పటికే పలువురిపై కేసులు
- మెటా సాయం కోరిన యంత్రాంగం

లక్నో, ఫిబ్రవరి 20: యూపీలో జరుగుతున్న మహా కుంభమేళాలో పుణ్యస్నానాలు చేస్తున్న మహిళల ఫొటోలు, వీడియోలను కొందరు ఆన్‌లైన్‌లో పెట్టడం, పైగా వాటిని అమ్మకానికి ఉంచడం సంచలనం కలిగించింది. 50 కోట్ల మందికి పైగా పాల్గొన్న ఈ ఆధ్యాత్మిక ఉత్సవంలో కొందరు నేరగాళ్లు ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడటంపై యూపీ అధికారులు అప్రమత్తమయ్యారు. మహా కుంభమేళాలో స్నానాలు చేస్తున్న, దుస్తులు మార్చుకుంటున్న మహిళల వీడియోలను సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసిన కొన్ని వేదికలను గుర్తించినట్టు యూపీ సామాజిక మాధ్యమ నియంత్రణ బృందం తెలిపింది. అలాంటి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో అమ్మకానికి పెట్టిన, కొనుగోలు చేసిన వ్యక్తులను అరెస్ట్ చేస్తామని యూపీ పోలీస్ డీఐజీ వైభవ్ కృష్ణ తెలిపారు. ఈ వీడియోలు అప్‌లోడ్ చేసిన ఇన్‌స్టా ఖాతాను గుర్తించేందుకు సహకరించాలని మెటాకు విజ్ఞప్తి చేశామని దీనిపై కోత్వాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశామన్నారు.

### ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో పురుషులే ఎక్కువ

న్యూఢిల్లీ: మన దేశంలో ఆత్మహత్యల రేటు 1990తో పోల్చినపుడు 2021నాటికి 30 శాతం తగ్గింది. 1990లో ఈ రేటు ప్రతి లక్ష మందికి 18.9 ఉండేది. 2019లో ఇది 13.1 కాగా, 2021లో 13కు తగ్గింది. అంటే, మూడు దశాబ్దాల్లో ఈ రేటు 31.5 శాతం తగ్గింది. ఈ కాలంలో పురుషుల కన్నా మహిళల ఆత్మహత్యల రేటు తగ్గింది. 1990లో ప్రతి లక్ష మంది జనాభాకు 16.8 మంది మహిళలు ఆత్మహత్య చేసుకోగా, 2021నాటికి ఇది 10.3కు తగ్గింది. 1990లో పురుషుల ఆత్మహత్యలు 20.9 కాగా, 2021లో 15.7గా 'ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్' తన నివేదికలో ప్రచురించింది.

## 119 చైనీస్ యాప్‌లపై వేటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: భారత ప్రభుత్వం మరోసారి డిజిటల్ ఏరివేతను చేపట్టింది. చైనాకు చెందిన 119 యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ నుంచి తొలగించాలని ఆదేశించింది. ఈ యాప్‌లలో చాలా వరకు వీడియో, వాయిస్ చాట్ ప్లాట్‌ఫామ్‌లే ఉన్నాయి. జాతీయ భద్రతకు, సార్వభౌమత్వానికి ముప్పుగా పరిణమిస్తున్న ఈ యాప్‌లపై తాజా నివేదిక ఒకటి ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 2020లో కూడా టిక్‌టాక్, షేరిట్ వంటి పాపులర్ యాప్‌లను భారత్ నిషేధించింది.

## గోధుమల నిల్వలపై కేంద్రం పరిమితులు

న్యూఢిల్లీ: గోధుమల నిల్వలపై కేంద్ర ప్రభుత్వం పరిమితులు విధించింది. ట్రేడర్స్/హోల్‌సేలర్స్ కేవలం 250 టన్నుల గోధుమలను మాత్రమే తమ వద్ద నిల్వ ఉంచుకోవచ్చు. గతంలో ఈ పరిమితి 1,000 టన్నులు ఉండేది. రిటైలర్స్ వద్ద ప్రతి ఔట్‌లెట్‌కు 4 టన్నుల గోధుమలను మాత్రమే నిల్వ ఉంచుకోవచ్చు. గతంలో ఈ పరిమితి 5 టన్నులు ఉండేది. గోధుమల ధరలను నిలకడగా ఉంచడం కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. ఈ ఆదేశాలు వచ్చే నెల 31 వరకు అమల్లో ఉంటాయి. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే, నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది.



## చేదెక్కనున్న కాఫీ!

**15%-20% పెరగనున్న ధర**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: రోజూ ఇంత కాఫీ నోట్లో పడందే చాలామందికి తెల్లవారదు. ఆ కాఫీ ధర త్వరలో చేదు రుచిని కలిగించవచ్చని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌లో కాఫీ పౌడర్ కిలో రూ.1000 ఉండగా, స్థానిక మార్కెట్లలో 15 నుంచి 30 శాతం వరకు ధర పెంచి అమ్ముతున్నారు. ముఖ్యంగా కాఫీ గింజలను అధికంగా సాగుచేసే కర్ణాటకలో ధర భారీగా పెరిగినట్టు తెలుస్తున్నది. కాఫీ ఉత్పత్తి దేశాలైన బ్రెజిల్, వియత్నాంలో పంట నష్టం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగాయని, ఆ ప్రభావం భారత్‌పై కూడా పడిందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. దేశంలో దాదాపు 70 శాతం కాఫీ గింజలు కర్ణాటలో ఉత్పత్తి అవుతాయి. ఆ రాష్ట్రంలో అరబికా, రోబస్టా రకాలను సాగుచేస్తారు. ఎరువులు, కూలీల రేట్లు వంటి పెట్టుబడి వ్యయం పెరగటం వల్లనే పంట ధరను పెంచినట్టు రైతులు తెలిపారు. ఇక డిమాండ్‌కు సరఫరాకు మధ్య ఉన్న భారీ తేడా కూడా ధరలు పెరగడానికి ఒక కారణమని అన్నారు.

విదేశాల్లో వైద్య విద్య చదవాలంటే

## నీట్-యూజీ అర్హత తప్పనిసరి

**సుప్రీం కోర్టు తీర్పు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: విదేశాల్లో ఎంబీబీఎస్ చదివి, అనంతరం భారత్‌లో ప్రాక్టీస్ చేయాలనుకునే విద్యార్థులకు నీట్-యూజీ పరీక్షలో అర్హత తప్పనిసరని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఈ నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తిరస్కరించింది. విదేశాలలో అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్య చదవడానికి వెళ్లే వారు తప్పనిసరిగా నీట్-యూజీకి అర్హత సాధించాల్సిందేనని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) విధించిన నిబంధనను సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఈ నిబంధన న్యాయమైనది, పారదర్శకమైదని, చట్టపరంగా ఎలాంటి అతిక్రమణలకు పాల్పడలేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

జడ్జీలపై విచారణ ఉత్తర్వులు

## ఆందోళనకరం

**లోక్‌పాల్‌కు సుప్రీంకోర్టు నోటీసులు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: లోక్‌పాల్, లోకాయుక్త చట్టం, 2013 కింద హైకోర్టు న్యాయమూర్తులను దర్యాప్తు చేసే అధికారం తనకు ఉందంటూ లోక్‌పాల్ జారీచేసిన ఉత్తర్వును సుప్రీంకోర్టు గురువారం నిలిపివేసింది. లోక్‌పాల్ ఉత్తర్వు కలవరపెడుతోందని పేర్కొన్న సుప్రీంకోర్టు దీనిపై కేంద్రానికి, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌కు నోటీసులు జారీచేసింది. ఒక హైకోర్టుకు చెందిన సిట్టింగ్ అదనపు న్యాయమూర్తిపై జనవరి 27న లోక్‌పాల్ జారీచేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. అయితే, సంబంధిత హైకోర్టు న్యాయమూర్తి పేరును వెల్లడించవద్దని ఫిర్యాదుదారుడిని ఆదేశించింది.